కూటి కోసం 'కాటి' విద్య..!

అంత్యక్రియలే కాటి కాపరులకు జీవనోపాధి

- కోవిడ్ కాలంలో త్యాగం వెలకట్టలేనిది
- వైకుంఠధామాలు వారి ఆవాసాలు
- ఇళ్లు లేక ఇబ్బంది పడుతున్న వైనం
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలని వేడుకోలు


వృద్ధులకు పండ్లు అందజేస్తున్న దృశ్యం(ఫైల్)


అంత్యక్రియలు నిర్వహిస్తున్న కాటికాపరులు(ఫైల్)

అందరూ ఉన్నా.. నా అనేవారు లేక ఒంటరి జీవితం గడిపి మధ్య వయసు, వృద్ధాప్యంలో తనువు చాలించిన వారికి, రోడ్డు పక్కన భిక్షాటన చేస్తూ చనిపోయి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో అనాథ శవాలుగా పడి ఉన్న వారికి అంత్యక్రియలు నిర్వహించారు.. వంశ పారంపర్యంగా వస్తున్న కుల వృత్తిని జీవనోపాధిగా చేసుకొని జీవనం సాగిస్తున్నారు.. తెల్లారే సరికి విధులు నిర్వహించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి కొందరు, నగరంలో అద్దెకు ఉంటున్న మరికొందరు పడరాని పాట్లు పడుతున్నారు. కోవిడ్ దశలోనూ తమ ప్రాణాలను పణంగా పెట్టి ఎటువంటి లాభాపేక్ష లేకుండా పనిచేశారు. వారే వైకుంఠ ధామాల్లో పనిచేసే కాటికాపరులు. వారు చేసే దుతున్న సేవలు, పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి'ప్రత్యేక కథనం..

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలో ఎవరైనా వృద్ధాప్యంతో గానీ, అనారోగ్యంతో గానీ అకాల మరణం చెందితే ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, రాజకీయ పార్టీలకు చెందిన లీడర్లు కాటికాపరులకు ఫోన్ చేసి చెప్పడంతో మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనల మేరకు రూ.6 వేలకు అంత్యక్రియలు చేసేందుకు ఒప్పుకుంటారు. వచ్చిన డబ్బులతో శవాన్ని కాల్చేందుకు కట్టెలు, డీజిల్, ఇతర ఖర్చులు పోను మిగిలిన డబ్బులను ఒక్కో ఏరియాకు చెందిన 8 మంది సభ్యుల బృందం పంపకాలు చేసుకుంటారు. ఒక్క ఖమ్మం సిటీలోనే మున్సిపల్ కార్పొరేషన్ గుర్తించిన 24 మంది కాటికాపరులు వైకుంఠ ధామాల్లో పనిచేస్తున్నారు.

ప్రాణాలను పణంగా పెట్టి..

ప్రపంచాన్ని వణికించిన కరోనా వైరస్ మహమ్మారి విజృంభణ సమయంలో.. ఎంతో మంది అనాథలుగా చనిపోయినప్పుడు నాటి మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు కాటికాపరులు ఎన్నో శవాలకు అంత్యక్రియలు నిర్వహించారు. కోవిడ్ పాజిటివ్‌తో మృతిచెందిన వారి దగ్గరకు కుటుంబసభ్యులు రాక పోయిన, ఆస్పత్రిలోనే వదిలేసి వెళ్లినా.. తమ ప్రాణాలను లెక్కచేయకుండా అలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా రోజుకు 20 నుంచి 30 శవాలకు దహనసంస్కారాలు చేశారు. అంత్యక్రియలు నిర్వహించే సమయంలో పీపీఈ కిట్లు ధరించినప్పటికీ పలువురు కాటికాపరులు కోవిడ్ బారినపడి కోలుకుంటే, మరికొందరు కరోనా మహమ్మారికి బలికాక తప్పలేదు.

ఇళ్లు లేక ఇబ్బంది..

కాటికాపరులు శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తే వచ్చే సొమ్ములో నుండి కొంతమేర సేవ కూడా చేయటం వీరు అదృష్టంగా భావిస్తున్నారు. వారికి ఉన్న కొద్ది మొత్తం సంపాదనలోనే వృద్ధులకు పండ్లు, భోజనం పంపిణీ చేయటం వంటి సేవా కార్యక్రమాలు చేస్తూ మానవత్వం చాటుకుంటున్నారు. మానవ సేవ చేసే వీరికి మాత్రం శాశ్వత గూడు లేక పోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి ఎంక్వయిరీ లేకుండా కాటికాపరులను అర్హులుగా గుర్తించి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని, ఖమ్మం కార్పొరేషన్ కింద అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి, నెలసరి వేతనం చెల్లించాలని వారు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ వీపీ గౌతమ్‌లకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇళ్లు అద్దెకు ఇవ్వడం లేదు..



అంత్యక్రియలు నిర్వహిస్తున్న తమకు ఖమ్మంలో ఉండేందుకు ఇళ్లు అద్దెకు ఇవ్వడం లేదు. శవాలకు కాల్చే వారికి ఇళ్లు అద్దెకు ఇవ్వమని చెబుతున్నారు. శవాలు కాల్చడమే మేము చేసే తప్పా. డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించడంతో పాటు తమ శ్రమను గుర్తించి నెలసరి వేతనం చెల్లించి, తాత్కాలిక ఉద్యోగులుగా గుర్తించాలి.

– చెరుకుపల్లి బాలు, కాటికాపరుల జాంబవంతుడు, సొసైటీ ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

జయప్రదం చేయండి

కామేపల్లి(కారేపల్లి): ఈ నెల 27, 28వ తేదీల్లో ఖమ్మంలో జరిగే మాదిగ హక్కుల దండోర రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని మాదిగ హక్కుల దండోర జిల్లా అధ్యక్షుడు కొరికపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం కామేపల్లి మండలం ముచ్చర్ల, కొత్తలింగాల, పొన్నెకల్లు, పింజరమడుగు, తాళ్లగూడెం గ్రామాల్లో రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షులు గొల్లపల్లి నరేష్‌కుమార్, కనకపూడి వీరస్వామి, చీగుర్తి కోటేశ్వరరావు, ముత్తయ్య, నాగులు, వెంకన్న, ఆనందరావు, శ్రీను, నాగరాజు, సంతోష్, దుర్గమ్మ, వెంకటలక్ష్మి, ఉప్పలమ్మ, బుచ్చమ్మ, సుజాత, సువార్త తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చింపిన వారిపై చర్యలు తీసుకోవాలి

నేలకొండపల్లి: శివరాత్రి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొడ్డు బొందయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎల్పీ నేత భట్టివిక్రమార్క, టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావులతో కూడిన ఫ్లెక్సీలు చించటం సిగ్గుచేటన్నారు. ఎంపీటీసీ రేగూరి వాసవి, నాయకులు బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, యడవల్లి నాగరాజు, బోయిన వేణు, కుక్కల హనుమంతరావు, జంగం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ, ఎంకామ్(పీజీ) రెండో బ్యాచ్ (1996–98) చెందిన విద్యార్థులు ఆదివారం ఎస్పీ కార్యాలయం రోడ్డులోని ఇప్పటి ఆర్యవైశ్య హాస్టల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.అనంతరం ఒకరికొకరు సన్మానించుకున్నారు. పూర్వవిద్యార్థులు అయిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, కోటేశ్వరావు, ఉమారాణి, శ్రీను, వెంకయ్య, గిరి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


చెక్కు అందిస్తున్న యూనియన్ బాధ్యులు

ఖమ్మం అర్బన్: నగరంలోని టూ వీలర్ మెకానిక్ జలగం శ్రీనివాసరావు కుమార్తె అక్షర ఎంబీబీఎస్‌లో సీటు సాధించటం పట్ల ఖమ్మం కార్పొరేషన్ టూ వీలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు వంగాల కొండలరావు మాట్లాడుతూ గత ఇరవై ఏళ్లుగా శ్రీనివాసరావు మెకానిక్‌గా పని చేస్తుండగా.. అతడి భార్య టీచర్‌గా ఉన్నారు. అనంతరం రూ.10వేలు ఆర్థిక సాయమందించారు. యూనియన్ బాధ్యులు అప్పారావు, రమేష్, శ్రీను, గంగరాజు, రవి, శేషు, రాము పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు విజయమ్మ..

నేలకొండపల్లి: మండలంలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను ఆదివారం పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ పరామర్శించారు. అనంతరం మృతుల కుటుంబసభ్యులకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయమందించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మయ్య, వెన్నబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సిరి ధాన్యాలపై అవగాహన

ఖమ్మం స్పోర్ట్స్ : జిల్లా నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం కస్తూర్బా విద్యాలయంలో సిరి ధాన్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ 2023 సంవత్సరానికి సిరి ధాన్యాలు అధికంగా వాడలంటూ ప్రచారం చేశారు. జిల్లా నెహ్రూ యువక కేంద్రం అధికారి చింతల్ అన్వేష్, భానుప్రసాద్, నూకల నరేష్, పాఠశాల ఇన్‌చార్జ్ మణి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథాల పంపిణీ

ఖమ్మంగాంధీచౌక్: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను ఆదివారం ఖమ్మం నగరంలోని రాఘవయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో త్రైత సిద్ధాంత ప్రభోధ సేవా సమితి ఇందూజ్ఞాన వేదిక సభ్యులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు సాంగ్యా, నాగరాజు, ఉమేష్, హనుమయ్య, సుజాత, దీక్షిత్, సంజయ్, ఐశ్వర్య, అశ్విని, శ్రీలత, సంయుక్త, విజయ, జయ, సత్యం, లక్ష్మణ్, శ్రీను పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


బీరోలులో మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జూపెడ, దమ్మాయిగూడెం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గానుక, పిండి మిల్లులను, బీరోలులో మిర్చి కొనుగోలు కేంద్రాన్ని, మానసిక వికలాంగుల కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈనేపథ్యంలో మానసిక వికలాంగుల కేంద్రంలో వికలాంగుల రవాణా, ఆహార ఖర్చులకు అయ్యే ఖర్చు ప్రతి నెలా తానే చెల్లిస్తానని హామీ ఇచ్చారు. ప్రతీ గ్రామ పంచాయతీకి రూ.10లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. దమ్మాయిగూడెంలో ప్రభుత్వం తీసుకొచ్చిన 59 జీఓతో ఇబ్బందులు ఉన్నాయని, బీరోలులో దళిత బంధుతో పాటు ఇళ్లు ఇవ్వాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీపీ మంగీలాల్, ఎంపీడీఓ జయరాం, ఏఓ సీతారాం రెడ్డి, ఐకేపీ ఏపీఎం అలివేలుమంగ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఐకేపీ అధికారులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ..

మండలంలోని ఆయా గ్రామాల్లో అనారోగ్యంతో చికిత్స పొందిన 49 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.16.25 లక్షల చెక్కులను ఆదివారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. అంతేకాక ఇటీవల మండలంలోని తిమ్మక్కపేటలో వల్లూరి సాయి నిఖిల్ అనే పార్టీ కార్యకర్త మృతి చెందడంతో అతడికి మంజూరైన రూ.2లక్షల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంగీలాల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

క్రీడలను విస్మరిస్తున్న ప్రభుత్వం


విజేతలకు బహుమతి అందిస్తున్న రాయల

నేలకొండపల్లి: క్రీడలను తెలంగాణ ప్రభుత్వం విస్మరిస్తుందని టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు ఆరోపించారు. మండలంలోని బోదులబండలో శివరాత్రి సందర్భంగా రాయల యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు జిల్లాల స్థాయిలో క్రికెట్ పోటీల విజేతలకు ఆదివారం బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ పోటీల్లో గుదిమళ్ల జట్టు ప్రథమ, నేలకొండపల్లి జట్టు ద్వితీయ, మంగాపురంతండా మూడో స్థానం, చెరువుమాధారం జట్టు నాల్గో స్థానాన్ని కైవసం చేసుకోగాబహుమతులు అందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బొడ్డు బొందయ్య, కాంగ్రెస్ నాయకులు బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, బోయిన వేణు, యడవల్లి నాగరాజు, సూరేపల్లి రవి, సైదిరెడ్డి, గుడిబోయిన వెంకటేశ్వర్లు, పగిడికత్తుల సుదర్శన్, శ్రీనాథ్, వీరబాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న కేవీ కృష్ణారావు

ఖమ్మం మామిళ్లగూడెం: సీఎం కేసీఆర్ హామీ మేరకు ఖమ్మం జిల్లా కేంద్రంలో పనిచేసే జర్నలిస్టులతో పాటు చిన్న, మధ్య తరగతి పత్రికల్లో పనిచేసే జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్యవేదిక జిల్లా చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు, కన్వీనర్ గుంతేటి వీరభద్రం డిమాండ్ చేశారు. ఆదివారం సంఘ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. నాడు తెలంగాణను వ్యతిరేకించిన ఆంధ్రా కార్పొరేట్ మీడియాకు ప్రాధాన్యత ఇచ్చి, తెలంగాణ ఉద్యమ కోసం కృషి చేసిన చిన్న, మధ్య తరగతి పత్రికల జర్నలిస్టులను విస్మరిస్తే సహించేదిలేదన్నారు. ఈ సమావేశంలో రెహమాన్, వెంకటరమణ, దాసరి శ్రీను, రవిచంద్రచౌహాన్, జంగిపల్లి రవి, సురేష్, ఉపేంద్రనాయక్, మురళి, గోపి, మస్తాన్, ఎస్‌కె.భాషా, సాధిక్ పాల్గొన్నారు.

'ప్రజలకు సమాధానం చెప్పాలి'

ఖమ్మంమయూరిసెంటర్: న్యూఢిల్లీలో ఆర్‌ఎస్‌ఎస్‌తో జమాతే ఇస్లామీ హింద్ (జేఐహెచ్) సమావేశాన్ని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తప్పుబట్టారు. మైనార్టీల తరఫున ప్రాతినిధ్యం వహించే హక్కు మీకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఆర్‌ఎస్‌ఎస్‌తో చర్చలు అవసరమని జేఐహెచ్ చెప్పడం దాని సొంత కపటత్వాన్ని ప్రతిబింబిస్తున్నదని అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సీపీఎం ఖమ్మం నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్‌తో ఏం చర్చించారన్నదానిపై మరింత స్పష్టత దేశ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ జమాతే ఇస్లామీ హింద్ చర్యపై పలు ముస్లిం, మైనార్టీ సంఘాలకు చెందిన నాయకుల నుంచి వ్యతిరేకత వచ్చిందని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, నాయకులు జబ్బర్, భండారు రమేష్, నవీన్ రెడ్డి, రమ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

'పది' విద్యార్థులకు వీడ్కోలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఐ సర్వయ్య, పాఠశాల డైరెక్టర్లు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని శ్రీనివాస నగర్‌లో గల రెజొనెన్స్ ఎస్వీఎం పాఠశాలలో ఆదివారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా త్రీటౌన్ సీఐ సర్వయ్య పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. పాఠశాల డైరెక్టర్లు ఆర్వీ నాగేంద్రకుమార్, నీలిమలు మాట్లాడుతూ.. తమ పాఠశాలలో విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ ధనాల రాధ, ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీని అడుగు పెట్టనీయం

నేలకొండపల్లి: తెలంగాణలో బీజేపీని అడుగు పెట్టనీయమని సీపీఎం పాలేరు ఇన్‌చార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రావెళ్ల భవన్‌లో ఆదివారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ మతోన్మాద విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. పాలేరులో మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రచార జాతాను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు రచ్చా నరసింహారావు, గుడవర్తి నాగేశ్వరరావు, ఏటుకూరి రామారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, కట్టికోల వెంకన్న, రాసాల కనకయ్య, సిరికొండ ఉమామహేశ్వరీ, బెల్లం లక్ష్మీ, బండి రామ్మూర్తి, మండవవు మురళి పాల్గొన్నారు.

తారకరత్నకు ఘన నివాళి


ఖమ్మం అర్బన్: పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

సినీ నటుడు నందమూరి తారకరత్న మృతి పట్ల తెలుగుదేశం పార్టీ నాయకులు ఘన నివాళులర్పించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో తారకరత్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తారకరత్న మృతి పార్టీకి, సినీ రంగానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్

బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్


పూజలు చేస్తున్న మంత్రి పువ్వాడ, తదితరులు

ఖమ్మం అర్బన్: బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని 4వ డివిజన్‌లోని పాండురంగాపురంలో గల సేవాలాల్ ఆలయంలో సేవాలాల్ ఉత్సవాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఆడబిడ్డల ప్రత్యేకమైన ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక ధృక్పథం, సామాజిక సంస్కృతి, జీవన విధానాన్ని కాపాడుకోవటం కోసం సేవాలాల్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, స్థానిక కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి, అజ్మీర వీరునాయక్, నర్రా ఎల్లయ్య, బాల్‌సింగ్, చక్రవర్తి, మంగీలాల్, జైపాల్, భాగ్యారావు పాల్గొన్నారు.

కోటపాడులో ఘనంగా గ్రామోత్సవం..

రఘునాథపాలెం: మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని కోటపాడు గ్రామంలో ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి పల్లకి మోశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాతుల రమణ, ఉపసర్పంచ్ కొంటెముక్కుల వెంకటేశ్వర్లు, నెల్లూరి చంద్రయ్య పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ..

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల ఉమ్మడి ఖమ్మం జిల్లా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2023 క్యాలెండర్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదివారం వీడీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హకీమ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి వేణుగోపాల్, గౌరవ అధ్యక్షులు కోటేశ్వరరావు, ఎండీ సలీం, మామిడి బాబూరావు, రామారావు, వై.వీరారెడ్డి, ఎస్వీ ప్రసాద్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సాయన్న మృతికి సంతాపం..

గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న మృతి పట్ల మంత్రి అజయ్‌కుమార్ సంతాపం తెలిపి వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. అలాగే, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్రలు సంతాపం తెలిపారు.

మార్గదర్శకుడు.. ఛత్రపతి శివాజీ


ఖమ్మంగాంధీచౌక్: అమ్మా భవానీ మందిరంలో శివాజీ జయంతి వేడుకలు


ఖమ్మం మామిళ్లగూడెం: శివాజీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ శ్రేణులు

హిందూ సామ్రాజ్య స్థాపనలో ఛత్రపతి శివాజీ అందరికీ మార్గదర్శకుడని పలువురు వక్తలు తెలిపారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను ఆదివారం పలు రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాలాభిషేకంతో పాటు యువత బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శివాజీ గొప్పతనం , సేవలను పలువురు కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్

సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం భాషా పండితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన విధంగా 5,571 ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులను హైకోర్టు తీర్పుకు లోబడి పండిట్, పీఈటీల 10,479 పోస్టులను అడహక్ పద్ధతిలో పోస్టింగులు ఇవ్వాలన్నారు. బదిలీలు, పదోన్నతులతో పాటు పండిట్ పీఈటీ పోస్టులను ఉన్నతీకరించాలన్నారు. సమావేశంలో ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గండు యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మన్సూర్, నాయకులు షేక్ మహబూబ్, పోతగాని వెంకన్న, బిల్లా సురేష్ బాబు,షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ బకాయిలు చెల్లించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీ

ఖమ్మంమయూరిసెంటర్: స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా అందించే వడ్డీలేని రుణాలకు సంబంధించిన వడ్డీ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి టి.ఝాన్సీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైఎస్సార్ హయాంలో పావల వడ్డీ రుణాలు ఇచ్చారని, కేసీఆర్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా మహిళా సభ్యుల నుంచి వడ్డీలు వసూలు చేసి తిరిగి చెల్లించాల్సిన నగదును మాత్రం విడుదల చేయలేదని మండి పడ్డారు. తక్షణమే వడ్డీ బకాయిలు, అభయ హస్తంకు చెల్లించిన నగదును సంఘాల సభ్యుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘ అధ్యక్షురాలు గోకినేపల్లి లలిత, ఉపాధ్యక్షురాలు ఆవుల మంగతాయి, ఎస్‌కె. షాను, కె.లక్ష్మి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం

ఖమ్మంరూరల్: జిల్లాలో ఉన్న గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ఖమ్మంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. మండలంలోని తెల్దారుపల్లిలో ఆదివారం జరిగిన సంఘం మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన హక్కులను రాయడానికి కుట్ర చేస్తోందని, బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా సంఘం ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన పేదలకు మూడెకరాల భూమి, గిరిజన బంధు ప్రకటించాలని పేర్కొన్నారు. ఈ నెల 25న కారేపల్లిలో జరిగే సంఘం జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బి.కృష్ణనాయక్, బి.హర్యానాయక్, గన్యానాయక్, మల్సూర్, వెంకన్న, శోభన్, బోడా భిక్షం తదితరులు పాల్గొన్నారు.

'రైతు వేదికలను దుర్వినియోగం చేస్తున్నారు'

నేలకొండపల్లి: రైతు వేదికలను అధికార పార్టీ నాయకులు దుర్వినియోగానికి పాల్పడుతున్నారని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని ఆరోపించారు. స్థానిక శ్రీసీతారామ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు వేదికలను బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలుగా మారుస్తున్నారని చెప్పారు. కాగా, ముజ్జుగూడెం రైతు వేదికలో పార్టీ కార్యక్రమాలు చేపట్టిన ఘటనపై సంబంధిత అధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ రేగూరి వాసవి, నాయకులు బచ్చలకూరి నాగరాజు, గోళ్ల శ్రీనివాసరావు, బోయిన వేణు, కుక్కల హనుమంతరావు, వెంకన్న, ఉపేందర్, భూక్యా రవి, యడవల్లి నాగరాజు, యాతాకుల శ్రీనాథ్, పగిడిమర్రి అజయ్, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శివరాత్రి ఉత్సవాలు

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలాల్లోని శివాలయాల్లో రెండో రోజు ఆదివారం ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని తరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించారు. జాతరలో ఏర్పాటు చేసిన రంగుల రాట్నం, జాయింట్ వీల్ వంటివి ఎక్కి చక్కర్లు కొట్టి ఆనందంగా గడిపారు. అనంతరం దుకాణాల్లో మిఠాయిలు కొంటూ షాపింగ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంరూరల్: తీర్థాల సంఘమేశ్వర ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి